## ఘనంగా 'మెట్టు' పుట్టినరోజు వేడుకలు



హరీశ్‌రావును సన్మానిస్తున్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

- మాజీమంత్రి హరీశ్‌రావును సన్మానించి ఆశీర్వాదం తీసుకున్న మెట్టుకుమార్
- పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలకు ఎలక్ట్రిక్ స్కూటీలు పంపిణీ

పటాన్‌చెరు, మే 15: పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలసి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆశీర్వాదం తీసుకున్నారు. హరీశ్‌రావును మెట్టుకుమార్ యాదవ్ ఘనంగా సన్మానించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కేక్ కట్ చేసి మెట్టుకుమార్‌కు తినిపించారు. పటాన్‌చెరు కార్పొరేటర్ పరిధిలో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. ప్రజాసేవలో ఉండే వారికి ఎప్పుడు ప్రజల ఆశీర్వాదం ఉంటుందన్నారు. మెట్టు కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా కార్పొరేట్ పరిధిలో ఉన్న ఆరుగురు బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలకు ఎలక్ట్రిక్ స్కూటీలు అందజేయగా, వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ కో ఆర్డినేటర్ ఆదర్శరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలకు ఎలక్ట్రిక్ స్కూటీలు పంపిణీ చేస్తున్న మెట్టుకుమార్ యాదవ్

## టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో అభివృద్ధి పనులు



బొల్లారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

జిన్నారం, మే 15: బొల్లారం మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.12 కోట్ల తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీయూఎఫ్‌ఐడీసీ) నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మాజీ పాలకవర్గ సభ్యులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ...బొల్లారం మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్న తెలిపారు. వివిధ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. భవిష్యత్తులో మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, హనుమంత్ రెడ్డి, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన బోరంచ



ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మనూరు, మే 15: నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటాడింది. మండల పరిధిలోని బోరంచ శివారు మంజీరా నది ఒడ్డున ఉన్న నల్ల పోచమ్మ ఆలయ ఏడువారాల జాతరలో భాగంగా గురువారం 3వ వారం కొనసాగింది. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ఒడి బియ్యం, బోనాల ప్రదక్షిణలతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భారీసంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతం జనసంద్రంగా మారింది. ఆలయానికి భక్తుల తాకిడి పెరగడం, తాగునీటి వసతి సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

## కవి మొగిలిమాలకు సత్కారం



కవి మొగిలిమాలకు ప్రశంసా పత్రాన్ని అందించి సన్మానిస్తున్న నిర్వాహకులు

జిన్నారం, మే 15: 'అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం' సందర్భంగా గురువారం నగరంలోని త్యాగరాయ గానసభలో పీనాకిని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'బంధాలు –అనుబంధాలు' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో జిన్నారం మండలం కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవి మొగిలిమాల సమ్మేళనంలో పాల్గొని కవితను వినిపించారు. అద్భుతంగా కవితను వినిపించిన కవి మొగిలిమాలను తెలంగాణ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, రిటైర్డ్ జడ్జి నిఠల మధుసూదన్‌రావు ప్రశంసా పత్రాన్ని అందించి ఘనంగా సన్మానించారు.

## వంద రోజులకు చేరిన నిరాహార దీక్షలు



నిరాహార దీక్ష చేస్తున్న నల్లవల్లి గ్రామస్తులు

గుమ్మడిదల, మే15: ప్యారానగర్ డంపింగ్ యార్డుతో ఇక్కడి గ్రామాల ప్రజల బతుకులు ఆగం చేస్తారా..? అని నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి ప్రశ్నిస్తున్నారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో ఏర్పాటుచేయనున్న డంపింగ్ యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఎంఎస్‌డబ్ల్యూ పనులు నిలిపివేసి, ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల ప్రజలు రైతు జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి వంద రోజులకు చేరుకున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో కుమ్మరి ఆంజనేయులు, కొరివి సురేశ్, రాజు, జింక ఇంద్ర, పట్నం పోచమ్మ, వెన్నెల్లి శాంతమ్మ తదితర జేఏసీ నాయులు, మహిళలు పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌లో దూకి తల్లీకొడుకు మృతి

నిజాంపేట్, మే 15: భర్త మృతిచెందడంతో మనోధైర్యం కోల్పోయిన భార్య తన కుమారుడితో కలిసి నిజాంసాగర్ జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల పరిధిలోని మునిగెపల్లికి చెందిన ధార ప్రమీల(32) తన ఎనిమిదేండ్ల కుమారుడు అక్షయ్‌తో కలిసి నిజాంసాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త ధార సాయిలు ఇటీవల క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త చనిపోయాడనే మనోవేదనతో కుంగిపోయింది. బుధవారం బ్యాంక్ పని ఉందని ఇంటి వద్ద చెప్పిన ప్రమీల కుమారుడు అక్షయ్‌ని తీసుకొని నిజాంపేట్ బయలుదేరింది. అక్కడి నుంచి నేరుగా నిజాంసాగర్ జలాశయం వద్దకు వెళ్లి అందులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం జలాశయంలో వీరి మృతదేహాలు తేలడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ధాన్యం వర్షార్పణం

అందోల్, మే 15: అకాల వర్షాలు రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయి. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి జోగిపేటతో పాటు మండలంలోని అల్మాయిపేట్, చింటకుంట, రోల్లపాడ్, డాకూర్ తదితర గ్రామాల్లో రైతులకు సంబంధించిన వందలాది క్వింటాళ్ల ధాన్యం నీళ్ల పాలైంది. మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 11, ఐకేపీ ఆధ్వర్యంలో 16, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 3 మొత్తం 30 కేంద్రాలు ఏర్పాటు చేయగా కొనుగోళ్లు మాత్రం నత్తనడకన సాగుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఏ కేంద్రం వద్ద చూసినా రైతులకు సరిపోను ఏర్పాట్లు చేయలేదు. గురువారం ఒక్క రోజే కురిసిన వర్షానికి అన్ని కేంద్రాల్లో ధాన్యం తడిసిపోవడంతోపాటు నీటిలో కొట్టుకుపోయిందని, గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### అకాల వర్షం...అపార నష్టం

పుల్కల్, మే 15: అకాల వర్షంతో రైతులకు అపార నష్టం జరిగింది. బుధవారం రాత్రి నుంచి పుల్కల్‌తోపాటు పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షానికి అన్నదాత అతలాకుతలమయ్యాడు. కష్టపడి పండించిన పంట కండ్ల ఎదుటే తడిసి ముద్దయితుంటే చేసేదేమి లేక బోరున విలపించారు. భారీ వర్షానికి ధాన్యం అంతాతడిసి ముద్దవడమే కాకుండా వడ్లన్నీ కొట్టుకుపోయాయి. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు రాత్రంతా మేల్కొని టార్పలిన్లు తీసుకొచ్చి ధాన్యం తడిసి పోకుండా కాపాడుకున్నారు. సరైన సమయానికి వడ్లు కొంటే ఇంత ఇబ్బందులు తలెత్తేవి కావని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం ఆరబెట్టి 30 రోజులు గడిచినా ప్రభుత్వం కాంటాలు వేయలేదన్నారు. మ్యాచర్ వచ్చిందని సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఈ నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

### ఆరబెట్టిన ధాన్యం వరదపాలు

నిజాంపేట్,మే,15: అకాల వర్షంతో ఆరబెట్టిన ధాన్యం వరదపాలై అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల పరిధిలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారుల్లో, రోడ్లపైన, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. నాయకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో కొనుగోలు చేయకపోవడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో తడిసి ముద్దయ్యాయన్నారు. వర్షానికి తడవకుండా కనీసం టార్పలిన్లు ఇచ్చి ఉంటే బాగుండేదని వాపోయారు. మండలంలోని బాచేపల్లి, రాంరెడ్డిపేట్, నాగదార్ గ్రామాల వద్ద రోడ్లపైన, కొనుగోలు కేంద్రాల వద్దే ధ్యానం ఉన్నదని, అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని చివరిగింజ వరకూ కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



అందోల్‌లో ధాన్యం నుంచి నీటిని బయటకు పంపుతున్న రైతు



గుమ్మడిదలలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

### కొట్టుకుపోయిన ధాన్యం

గుమ్మడిదల, మే15: మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రైతులు పంటలను రోడ్లపై, ఆరుబయట ఆరబోశారు. ఒక్కసారిగా వర్షం రావడంతో ఆరబెట్టుకున్న ధాన్యం వరదనీటితో కొట్టుకుపోయింది. రైతులు వానలోనే ధాన్యాన్ని కుప్పలు చేసి ప్లాస్టిక్ కవర్లు వేసి జాగ్రత్త పడ్డారు.

### కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు

నారాయణఖేడ్, మే 15: నారాయణఖేడ్‌తో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. మండలంలోని 13 కొనుగోలు కేంద్రాల్లో సుమారు 600 క్వింటాళ్ల వడ్లు తడిసిపోయినట్లు అంచనా. కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేగవంతంగా కొనసాగకపోవడం, గన్నీ బ్యాగుల కొరత, సరిపడా టార్పాలిన్లు లేక వర్షానికి ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోయే దుస్థితి నెలకొంది. నిర్దేశించిన స్థాయిలో తేమ శాతం ఉంటే తప్ప ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచి పడిగాపులు కాస్తున్నా తూకం వేయడం లేదని వాపోతున్నారు.

### కోహీర్‌లో...

కోహీర్. మే15: పట్టణంతోపాటు కవేలి, దిగ్వాల్, వెంకటాపూర్, నాగిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, పైడిగుమ్మల్, బిలాల్‌పూర్, తదితర గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి నారింజ వాగులో నీరు ప్రవహించింది. రైతుల పొలాల్లో చేరింది. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షంనీరు నిలిచింది. ఎంపీపీ కార్యాలయం వద్ద నిలిచిన నీటితో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### జిన్నారంలో...

జిన్నారం, మే 15: అన్నదాతలపై ప్రకృతి పగబట్టింది. మండలంలో కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. అష్టకష్టాలు పడి పండించిన ధాన్యం బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసి ముద్దయింది. వర్షానికి తడవకుండా ధాన్యాన్ని కాపాడుకోవడానికి అన్నదాతలు ఉరుకులు, పరుగులు పెట్టారు. సకాలంలో తూకం వేయకపోవడంతో పండించిన ధాన్యం నేలపాలైందని మండల రైతులు వాపోయారు. కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యం వరదలో కొట్టుకుపోయింది.



పుల్కల్: వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపుతున్న ముద్దాయిపేట రైతులు



హత్నూర: గుండ్లమాచునూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలు



జిన్నారం: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు



పుల్కల్: భారీ వర్షానికి తడిసిన ధాన్యం



నారాయణఖేడ్: వెంకటాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం

## వైద్యాధికారులతో డీఎంహెచ్‌వో సమీక్ష




వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో గాయత్రిదేవి

నారాయణఖేడ్, మే 15: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులతో గురువారం డీఎంహెచ్‌వో గాయత్రిదేవి సమీక్ష నిర్వహించారు. ఇందులోభాగంగా పీహెచ్‌సీల నిర్వహణ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు తదితర అంశాలపై పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తీసుకునే చర్యలపై వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని, మందుల కొరత తలెత్తకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి మహేందర్‌రెడ్డి వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

సంగారెడ్డి, మే 15: ప్రభుత్వం అమలుచేసే రాజీవ్ యువ వికాసం పథకంలో సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేసి, ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ..నిరుద్యోగ యువతకు షరతులు లేకుండా రూ.4లక్షల నుంచి రూ.10లక్షల వరకు రుణపరిమితి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ పథకంలో రాజకీయ జోక్యం లేకుండా రుణాలు మంజూరు చేయాలని, అర్హులైన పేద నిరుద్యోగులకు అవకాశం కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.4లక్షల బ్యాంకు లింకేజీతో రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఇటీవల సిబిల్ స్కోర్ ఉంటేనే రుణాలు ఇస్తామనడం సరికాదన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిబిల్ స్కోర్ అవసరం లేదని ప్రకటించినా అధికారులకు స్పష్టమైన ఆదేశాల ఇవ్వలేదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అశోక్, శివకుమార్, శ్రీకాంత్, సాయిలు ఉన్నారు.


## బైక్ కొనలేదని బావిలో దూకిన యువకుడు



యువకుడిని బయటకు తీసిన స్థానికులు

జహీరాబాద్, మే 15: అమ్మ బైక్ కొనివ్వలేదని ఓ యువకుడు బావిలో దూకిన ఘటన న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గిలో గురువారం చోటుచేసుకొంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాల్మన్ తనకు బైక్ ఇప్పించాలని మూడురోజులుగా తల్లి మొగులమ్మతో మొర పెట్టుకున్నాడు. అతడు ఎంత బతిమిలాడినా ఆమె బైక్ కొనిచ్చేందుకు అంగీకరించలేదు. దీంతో ఆగ్రహం చెందిన యువకుడు బావిలో దూకుతానని తల్లితో చెప్పి గ్రామ శివారులో ఉన్న బావిలో దూకాడు. బావిలో ఉన్న మోటరు పైపును పట్టుకొని అలాగే ఉండిపోయాడు. తల్లి కొడుకు విషయం స్థానికులకు చెప్పడంతో వెంటనే స్పందించి తాడు సహాయంతో పైకి తీశారు. ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## నిందితుల రిమాండ్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ

అందోల్, మే 15: నగల కోసం అంగన్‌వాడీ టీచర్‌ను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బస్వాపూర్‌కు చెందిన బేగరి జయమ్మ(57) అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తుంది. ఈనెల 7న విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో మృతురాలి కుమారుడు క్రాంతికుమార్ పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు బస్వాపూర్‌కు చెందిన పుట్ట అనిల్‌కుమార్, డప్పు వినిత్ బంగారు నగల కోసం జయమ్మను హత్య చేసినట్లు తేలిందన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చంపినట్లు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు. అనిల్‌కుమార్ అద్దెకు నడిపేకారులో మృతదేహాన్ని తీసుకెళ్లి చేగుంట మండలం వడియారం శివారులో, మృతురాలు ఫోన్ చింతకుంట మంజీరానదిలో పడేసి నగలను జోగిపేటలో కుదువపెట్టి డబ్బులు తీసుకున్నారని తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## అక్రమ కట్టడాల కూల్చివేత

అమీన్‌పూర్, మే 15: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శెట్టికుంటలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను గురువారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. గతంలో అనేకమార్లు అక్కడ అక్రమ నిర్మాణాలు చేస్తే కూల్చివేసినప్పటికీ అక్రమార్కులు అదే స్థలంలో మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తూనే ఉన్నారని అధికారులు తెలిపారు. ఒక పక్క రెవెన్యూ అధికారులు ప్రభుత్వ, ఎఫ్‌టీఎల్ స్థలాల్లో నిర్మాణాలు చేస్తే వెంటవెంటనే కూల్చివేస్తున్నా అక్రమమార్కుల అగడాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయని, అందువల్ల అక్రమ నిర్మాణాలపై ఉపేక్షించేదిలేదని టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ పేర్కొన్నారు.

## రీజినల్ రింగ్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 15: రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపులు ప్రామాణికంగా ఉండాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో భూసేకరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రింగ్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి గ్రామంలో భూసేకరణకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రాజెక్టు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్వే ప్రక్రియ నుంచి పరిహార చెల్లింపుల వరకు ప్రతిదశలో అధికారుల బాధ్యత ఉండాలన్నారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో భూసేకరణకు సంబంధించి రైతుల్లో అభిప్రాయ భేదాలు, సర్వేలో సాంకేతిక సమస్యలు, స్థానికస్థాయిలో అవగాహన లోపం వంటి అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో రీజినల్ అధికారి శివశంకర్, యాదాద్రి భువనగిరి జిల్లా అధికారులు, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

## ఇవి వరద జలాలు కాదు..

# గ్రాన్యువల్ గరళ జలాలు



గ్రాన్యువల్ ఇండియా పరిశ్రమ నుంచి వాననీటితో వస్తున్న రసాయన వ్యర్థ జలాలను చూపిస్తున్న గ్రామస్తుడు

గుమ్మడిదల, మే 15: ఇవి వరద జలాలు కాదు..గ్రాన్యువల్ ఇండియా పరిశ్రమకు చెందిన గరళ జలాలు. పరిశ్రమలో వేలకొద్దీ నిల్వచేసిన కాలుష్య వ్యర్థజలాలను వర్షం నీటితో వదిలి చేతులు దులుపుకుంటున్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం నీటితో గ్రాన్యువల్ ఇండియా పరిశ్రమలో నిల్వ చేసిన వ్యర్థజలాలను వదిలారు. జీరో డిశ్చార్జీతో పరిశ్రమను నడిపిస్తున్నామని చెబుతున్నా, పరిశ్రమలో జీరో డిశ్చార్జి నిర్వహించకుండా ఉత్పత్తిలో వెలువడిన వ్యర్థజలాలను వాననీటిలో వదిలి భూగర్భ జలాలను, దిగువన ఉన్న జిన్నారం రాయుడి చెరువును కలుషితం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పీసీబీ అధికారులు కాలుష్య జలాలను తనిఖీ చేయడానికి మొక్కుబడిగా వచ్చి కలుషిత జలాలు లేని ప్రాంతాల్లో జలాల నమూనాలు సేకరించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి వ్యర్థజలాలు పరిశ్రమల ప్రాంతాలో చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రసాయన వ్యర్థజలాలతో భూగర్భజలాలు కలుషితం చేస్తున్న పరిశ్రమలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా బొంతపల్లి, దోమడుగు, అనంతారం, మంభాపూర్ పారిశ్రామికవాడలో ఉన్న రసాయన పరిశ్రమలు ఇదే పద్ధతి పాటిస్తూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించి సదరు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

రాయికోడ్, మే 15: రాయికోడ్ తెలంగాణ ఆదర్శ పాఠశాల వసతి గృహంలో పనిచేయుటకు అవసరమైన సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దీపిక తెలిపారు. గురువారం రాయికోడ్‌లోని కేజీబీవీలో ఏర్పాటు చేసిన సమవేశంలో ఆమె మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసే వసతి గృహంలో పనిచేయుటకు కేర్‌టేకర్ (బీఈడీ, డీఈడీ, డిగ్రీ), వాచ్‌మెన్, అటెండర్ (10వ తరగతి), వంట మనిషి (10 తరగతి), ఏఎన్ఎం (ఇంటర్, ఏఎన్ఎం సర్టిఫికెట్), స్వీపర్(7వ తరగతి) చదువు కొని ఉండాలన్నారు. పనిచేయుటకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఈనెల 19లోగా కేజీబీవీ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

## ఆల్ఫాజోలం పట్టివేత

జహీరాబాద్, మే 15: నిషేధిత డ్రగ్స్ సరఫరా చేస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో గురువారం జహీరాబాద్ 65వ జాతీయ రహదారిపై ఇంద్రప్రస్థ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించామని ఎస్సై కాశీనాథ్ తెలిపారు. పూణె నుంచి జహీరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేయగా అనుమానితుడిగా ఉన్న విశ్వనాథ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద 750 గ్రాముల ఆల్ఫాజోలం, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిని విచారించగా జహీరాబాద్‌కు చెందిన మిద్దె స్వామిగౌడ్‌కు డ్రగ్స్‌ను విక్రయించేందుకు వచ్చానని అంగీకరించాడు. దీంతో స్వామిగౌడ్ నుంచి రూ.7.50లక్షలు, కారు, రెండు ఫోన్లు సీజ్ చేశారు. సుమోటోగా కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సై కాశీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

పటాన్‌చెరు రూరల్, మే 15: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రుద్రారంలో గురువారం ఎంఎస్ఎన్ పరిశ్రమ వద్ద విధులకు వచ్చిన సదాశివపేటకు చెందిన అంబా భూమయ్య (50)ను కంపెనీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీఐటీయూ నాయకులు పరిశ్రమ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ నష్టపరిహారానికి డిమాండ్ చేశారు. మరోఘటనలో జగిత్యాలకు చెందిన అబ్దుల్ మజీద్ (46) బైక్‌పై ఇస్నాపూర్ శివారులోని తార గ్రీన్ కంపెనీ వద్దకు వెళ్తుండగా వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాజీద్ అక్కడికక్కడే మృతి చెందాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు.

## నేపాల్ యువకుడి ఆత్మహత్య

కోహీర్, మే 15: మండలంలోని దిగ్వాల్‌లో నేపాల్‌కు చెందిన యువకుడు వినోద్ (35) ఉరేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం...గ్రామంలో ఉంటూ ఓ వ్యక్తి వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం నుంచి షాప్ తెరవలేదు. దీంతో అతడి స్నేహితులు వచ్చి పిలిచినా స్పందన రాకపోవడంతో తలుపుతీసి చూసేసరికి ఉరేసుకొని ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. శవాన్ని పోస్టుమార్టం కోసం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. ఎస్సై సతీశ్‌వర్మ ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

**PUBLIC NOTICE**

It is Inform to General Public that my client **Katkam Jamuna W/o Late Katkam Chandra Shekar** Aged about 63 Yrs, Occ: House Hold, R/o. H.No.3-2-52, Sagar Nagar, Sadasivpet Town and Mandal, Sanga reddy, Dist, Pin No. 502291 She is Having Ancestral Property House Bearing No. 3-2-52, Admeasuring 238.00 Sq. yards Situated at Sagar Nagar, Sadasivpet town and Mandal, Sangareddy Dist Vide Partition Deed No. 3041 of 2006 Dated 17-07-2006 in the name my client **my husband Late Katkam Chandra Shekar** and the said document lost and I searched at our level best but not traced I am executing sale deed document in my childrens favor, if anybody having Objections kindly Approach My Client or me within 7 days from the date of Publication.

**Sd/- MD. ZULFIKAR HUSSAIN**
**WASIYA SULTANA**
Advocate,
H.No. No.4-8-92,
Shivadayananda Colony,
Sadasivpet Town and Mandal
Sangareddy, Medak Dist.
Cell: 9440206272

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: SANGAREDDY**
**O.S.NO. 491 OF 2025**

**Between:**
1. Smt. Veenam Udayshree Shashi Kumar W/o. Veenam Shashi Kumar, aged 34 years, Occ: House Wife, 2. Kumari Veenam Shanvi D/o. Veenam Shashi Kumar, aged 08 years, Occ: Student, 3. Kumari Veenam Omaira, D/o. Shashi Kumar W/o. Veenam Shashi Kumar, aged 01 years, All are R/o. H.No. 13-1-67/13/26, Avanthinagar, Extension Nagar, Moti Nagar, Vijetha School, Balanagar, Sanathnagar, Medchal-Matkaigiri Dist. ...Plaintiffs

**AND**

1. Veenam Krisnamurthy S/o. Veenam Viraiyya, aged 68 Years, Occ: Nil, 2. Veenam Pushpanila W/o. Veenam Krishnamurty, aged 60 years, Occ: Nil, Both are R/o. NGOS Colony, LIG Mahabubabad Town and District. 3. The Tahsildar, Ameenpur Mandal, Sangareddy Dist. 4. TO whom so ever all concerned. ...Defendants

**TO WHOM SO EVER IT MAY BE CONCERN**

Take notice that the plaintiff filed suit for declaration to declare the notice as absolute owners of and possessors of suit schedule property being the legal heirs of deceased Veenam shashikumar.

The deceased Veenam Shashikumar is owner at part and parcel of the residential apartment No. B-1032 on 10th floor in Block admeasuring 918 Sq.Ft of salable area exclusive balcony area 36 Sq.Ft and proportionate undivided share of land admeasuring 184.79 Sq.ft (20.53 Sy, yds) along with Allotment of One Sy yds) reserved car parking in multi-storied Residential Apartment Complex known ass "SPRING IS IN THE AIR' being constructed on the Schedule Project land in bearing Sy.no. 178/Part, 179/Part, 180/Part and 181/Part Total Admeasuring 22917.42 Sq.mts situated at Ameenpur Village, Ameenpur Municipality, Ameenpur Mandal, Sangareddy District and the apartment is bounded by: North: Open to Sky South: Open to Sky East: Corridor, West: Open to Sky.

This suit is posted on 31-07-2025 for appearance and hearing.

**Sd/- L.SANGRAM, Advocate**
Counsel for the plaintiff
Sangareddy, **Cell No. 9440707474.**